28న 100వ పోస్టల్ డాక్ అదాలత్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: ఈ నెల 28వ తేదీ ఉదయం 11.00 గం.లకు ఎంవీపీ కాలనీలోని పోస్టల్ అడ్మినిస్ట్రేటివ్ కాంప్లెక్స్ భవనంలో 100వ పోస్టల్ డాక్ / పెన్షన్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆర్.ఎం.ఎస్-వి డివిజన్ సూపరింటెండెంట్ ప్రసన్న రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన జారీ చేశారు. ఆర్.ఎం.ఎస్.(రైల్వే మెయిల్ సర్వీసెస్) - వి డివిజన్ పరిధిలోని ఉత్తరాంధ్ర, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన వారు తపాలా సేవలు, పింఛన్ల వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై ఫిర్యాదులను ఈ నెల 21వ తేదీలోగా సూపరింటెండెంట్, ఆర్.ఎం.ఎస్.-వి డివిజన్ పేరుతో ఎంవీపీ కాలనీలోని పోస్టల్ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయానికి పంపించాలని ఆయన ప్రకటన ద్వారా కోరారు.

మంత్రుల కుర్చీ కోసం మంత్రాంగం

రాజధాని బాట పట్టిన ఆశావహులు
కుల సమీకరణలు, సీనియారిటీతో ఆశలు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ఐదేళ్ల అధికారానికి దూరమైన కొంతమంది నేతలు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు తమకు అనుకూలంగా రావడంతో మంత్రుల కుర్చీల కోసం మంత్రాంగం మొదలుపెట్టారు. కూటమి తరపున గెలిచిన ఎమ్మెల్యేల్లో అప్పుడే అమాత్య పదవిపై ఆశలు మొదలయ్యాయి. ఫలితాలు వచ్చి రెండు రోజులు గడవక ముందే ఎవరికి వారు తమకే మంత్రి పదవి దక్కుతుందంటూ అంచనాలేసుకుంటున్నారు. వారితో పాటు వారి ప్రధాన అనుచరులు కూడా ఊహల పల్లకీలో విహరిస్తున్నారు. సీనియారిటీ, సామాజిక సమీకరణలు, కూటమి పెద్దలతో ఉన్న పరపతి, పరిచయాలు, అనుబంధాలు ఇందుకు దోహదపడతాయని పైరవీలు మొదలుపెట్టారు. ఎవరికి అనుకూలంగా వారు లెక్కలేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఉమ్మడి విశాఖ జిల్లా నుంచి 13 మంది ఎమ్మెల్యేలు కూటమి తరపున ఎన్నికయ్యారు. వీరిలో నలుగురు జనసేన, ఒకరు బీజేపీ నుంచి, మిగిలిన ఎనిమిది మంది టీడీపీ నుంచి గెలుపొందగా, ఉమ్మడి విశాఖ జిల్లాలో బిజెపి, జనసేన, టిడిపి కూటమి నుండి గెలుపొందిన ఐదుగురు ప్రముఖంగా మంత్రి పదవుల కోసం తమ లాబీయింగ్ మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. విశాఖ తూర్పు నియోజకవర్గం నుంచి నాలుగోసారి గెలిచిన వెలగపూడి రామకృష్ణబాబు ఈ దఫా మంత్రి పదవిని ఆశిస్తున్నారు. ఆయనకు బాలకృష్ణతో పాటు ఆయన అల్లుడు, విశాఖ ఎంపీగా ఎన్నికైన శ్రీభరత్‌తో సత్సంబంధాలున్నాయి. కమ్మ సామాజిక వర్గానికి చెందిన వెలగపూడికి ఇవన్నీ కలిసి వస్తాయని మంత్రి పదవి దక్కుతుందని ఆయన అనుచర వర్గం ఆశిస్తుంది. ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలుపొందిన గంటా శ్రీనివాసరావు కూడా మంత్రి పదవిపై నమ్మకంతో ఉన్నారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో మంత్రిగా పనిచేశారు. తన సామాజిక వర్గం కోటా కలిసొస్తుందని ఆయన ఆశతో ఉన్నారు. తన వియ్యంకుడు పి.నారాయణతోపాటు మెగాస్టార్ చిరంజీవి కుటుంబం గంటాకు సహకరిస్తారని ప్రచారం సాగుతోంది. పెందుర్తి నుంచి జనసేన తరపున ఎన్నికైన పంచకర్ల రమేష్ బాబు మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జనసేన కోటా, సామాజికవర్గం కలిసొచ్చే అంశాలుగా చెప్పుకుం టున్నారు. అయితే గంటా, పంచకర్లది ఒకే కాపు సామాజికవర్గం కావడంతో వీరిద్దరిలో ఒకరికే మంత్రి పదవి వస్తుందని ఆయన వర్గీయులు భావిస్తున్నారు. విశాఖ దక్షిణ నియోజకవర్గం నుండి జనసేన నుండి గెలుపొందిన వంశీకృష్ణ శ్రీనివాస్ కూడా అధిక మెజారిటీతో రాష్ట్రంలో అత్యధిక ఓట్లు పొందిన ఎమ్మెల్యేగా, జనసేన కోటాలో, యాదవ సామాజిక వర్గంలో తనకు కూడా మంత్రి పదవి వస్తుందని, అధినేత పవన్ ఆ దిశగా తనకు ప్రాధాన్యం ఇస్తారని ఆయన వర్గీయులు భావిస్తున్నారు. నర్సీపట్నం నుంచి ఏడోసారి గెలుపొందిన అయ్యన్న తనకు మంత్రి పదవి ఖాయమన్న భావనలో అందరూ ఉన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన ప్రతిసారీ కేబినెట్‌లో స్థానం దక్కడంతో అయ్యన్న వర్గం ధీమా వ్యక్తం చేస్తున్నారు. గాజువాక నుంచి టీడీపీ తరపున రెండోసారి రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీతో గెలిచిన పల్లా శ్రీనివాసరావు తన యాదవ సామాజికవర్గ కోటాలో మంత్రివర్గంలో స్థానం ఉంటుందన్న నమ్మకంతో ఉన్నారు. ఆయన అనుచరులు ఇప్పటికే ఈ ప్రచారం మొదలు పెట్టారు. విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి రెండోసారి ఎన్నికైన విష్ణుకుమార్ రాజు తనకు కూటమి బీజేపీ కోటాలో మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశతో ఉన్నారు. పాయ కరావుపేట నుంచి రెండోసారి ఎన్నికైన వంగలపూడి అనిత కూడా మంత్రివర్గంలో చోటు దక్కుతుందని ఆశిస్తున్నారు.

ఎస్సీ సామాజికవర్గం, మహిళా కోటా తనకు కలిసొస్తుందని, పార్టీలో ఉన్న పలుకుబడితో మంత్రి పదవి కోసం పట్టుబడు తున్నట్లు తెలుస్తోంది. జనసేన తరపున అనకాపల్లి నుంచి గెలిచిన కొణతాల రామకృష్ణ 2004లో వైఎస్ రాజశేఖ రెడ్డి హయాంలో వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా పనిచేశారు. జనసేనలో తాజాగా చేరినప్పటికీ రాజకీయాల రీత్యా సీని యర్ నేతగా కొణతాల రామకృష్ణను పవన్ కళ్యాణ్ అభిమానిస్తున్నారని ఈ కేబినెట్‌లో బెర్త్ ఖాయమని కొణతాల వర్గీయులు భావిస్తున్నారు. చివరి నిమిషంలో మాడుగుల సీటు దక్కించుకుని పోటీ చేసి గెలిచిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. అయితే అయ్యన్న, బండారు ఒకే వెలమ సామాజికవర్గం కావడం, ఇద్దరు ఒకే జిల్లాలో ఉండడంతో ఇద్దరిలో ఒకరికే వస్తుందని ఈ ఇరువురు నేతల వర్గీయులు అభిప్రాయపడుతున్నారు. ఈనెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసే రోజున మంత్రులుగా తమకు అవకాశం లభిస్తుందని, ఇప్పటికే ఓ దశ అమరావతి వెళ్లి వచ్చిన ఆశావహులు అంతా మరోసారి విజయవాడ బాటపట్టారు. చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ చుట్టూ తమ పలుకుబడిని, పైరవీలతో సామాజిక సమీకరణలను తెరపైకి తీసుకు వస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం ద్వారా తెలిసింది.

పూర్వ ప్రాథమిక తరగతుల గుర్తింపునకై జిప్సా వినతి

విశాలాంధ్ర - పెదగంట్యాడ: 1 నుండి 10వ తరగతి మాదిరిగా నర్సరీ, యల్.కె.జి, యు.కె.జి తరగతుల నిర్వహణ కొరకు ప్రభుత్వ గుర్తింపు మంజూరు చేయించాలని కోరుతూ గాజువాక ప్రైవేట్ పాఠశాలల సంఘం (జిప్సా) నాయకులు గాజువాక, పెదగంట్యాడ ఎంఈఓలు ఎం.సునీత, విశ్వనాదం, శ్రీనివాస్, రమనాజీలకు వినతి అందించారు. తద్వారా ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్వహించుకుంటున్న వందలాది ప్లే స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లే స్కూల్స్ ముసుగులో 1,2,3 తరగతులు కూడా నిర్వహి స్తున్నారని, కనుక సిటీ పరిధిలో పుట్టగొడుగుల్లా ప్రతీ వీధికొకటి వెలసిపోతున్న ప్లే స్కూల్‌లను పరిశీలించి, తగు చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు కోరారు. వారిని కలసిన వారిలో జిప్సా అధ్యక్షుడు పి.భాస్కర రావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్, సభ్యులు సత్యన్నారాయణ, బాబురావు, విజయ్ తదితరులున్నారు.

కాలినడకన సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న నేతలు

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి స్వామివారిని టీడీపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు కాలినడకన సింహాద్రి అప్పన్నను దర్శించు కున్నారు. ఓట్ల లెక్కింపులో భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అత్యధిక మెజారిటీతో గెలిచిన సందర్భంగా కాలినడకన సింహాద్రి అప్పన్నను దర్శించకున్నామని నేతలు పేర్కొన్నారు.

ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు

విశాలాంధ్ర - పెందుర్తి: భారీ మెజార్టీతో తనను గెలిపించిన పెందుర్తి ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు స్పష్టం చేశారు. సుజాతనగర్ కళ్యాణ మండపంలో ఎన్డీఏ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఏ సమస్యకైనా అర్ధరాత్రి వేళ ఫోను చేసినా తాను స్పందిస్తానని తెలిపారు. తన గెలుపు కోసం టీడీపీ, బిజెపి, జనసేన నాయకులు ఎంతో కృషి చేసారని, వారికి జీవితాంతం రుణపడి ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే వైసీపీ నాయకులు కూడా తనకు లోపాయ కారిగా సహకరించారన్నారు. జగన్ పాలనలో అన్ని విధాల నష్టపోయిన రాష్ట్రాన్ని కాపాడుకోవాలనే సంకల్పంతో ప్రజలు కూటమికి మద్దతు పలికారని, వారి ఆశలకు అనుగుణంగా పోలవరం, అమరావతి నిర్మాణాలు, సాగునీటి ప్రాజెక్టులు ఏర్పాటు, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి కల్పన వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ పెందుర్తి కన్వీనర్ గొర్లె రామునాయుడు, జీవీఎంసీ టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, సేనాపతి శంకర్రావు, మాజీ జెడ్పీటీసీ రెడ్డి నారాయణరావు, జనసేన నాయకులు పిన్నింటి పార్వతి, కంచిపాటి మధు, సేనాపతి సోమశేఖర్, దుంబురు సీలు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో వర్క్ షాప్

విశాలాంధ్ర - మల్కాపురం: చిత్రలేఖనంలో మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం వర్క్ షాప్‌ను నిర్వహించారు. ప్రముఖ చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస్ మనోహర్ చిన్నారులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇస్తూ ప్రతి ఒక్కరు రంగులను ఎంపిక చేయడంలో, చిత్రాలను వేయడంలో శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. ఆయన స్వయంగా అనేక చిత్రాలను బోర్డుపై వేసి విద్యార్థులకు చూపించారు. అనంతరం నృత్యంలో, గానంలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్, ప్రముఖ రచయిత కె.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో కథలు రాయడంపై, చిత్రలేఖనంపై వర్క్ షాపులను నిర్వహించడం ఎంతో ఘనమైన విషయం అని అన్నారు. శిక్షణ శిబిరానికి స్వచ్ఛందంగా హాజరైన రిసోర్స్ పర్సన్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారంతో ముగియనున్నది.

దక్షిణం ప్రజల రుణం తీర్చుకుంటా

ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర చరిత్రలో అత్యధిక మెజార్టీతో గెలిపించిన విశాఖ దక్షిణ నియోజకవర్గ కుటుంబ సభ్యులకు రుణపడి ఉంటానని రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. నా మీద అత్యంత నమ్మకంతో రాష్ట్ర చరిత్రలో ఇంతటి ఘన విజయం చేకూర్చినందుకు, నియోజకవర్గం అభివృద్ధిలో రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. నాపై ఎంతో అభిమానంతో, నమ్మకంతో, ఆదరా భిమానాలతో రాత్రి పగలు కష్టపడి నా గెలుపునకు సహకరించిన జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులకు, అభిమానులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని తెలిపారు.

బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరి

విశాలాంధ్ర - ఆనందపురం: క్షయవ్యాధి రాకుండా పెద్దలంతా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి డాక్టర్ ఎం.గంగు నాయుడు కోరారు. మండలంలోనే గంభీరం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో జరుగుతున్న బీసీజీ వాక్సినేషన్ సెంటర్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. క్షయ వ్యాధి రాకుండా 60 సంవత్సరాలు పూర్తయిన వారికి, గత 3 ఏళ్లలో క్షయ వ్యాధి వచ్చిన వారి ఇంట్లో కుటుంబ సభ్యులకు, పొగ అలవాటు ఉన్నవారికి, బీఎంఐ 18 లోపు వున్నవారికి, షుగర్ వ్యాధి గ్రస్తులు, గత 5 ఏళ్ల లో టిబి వ్యాధి వచ్చి తగ్గినవారు, ఈ బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని ఆయన సూచించారు. గత నెల 16వ తేదీ నుంచి ప్రతి గురువారం ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజలంతా వారికి దగ్గరలో వున్న వారి ఏఎన్ఎం లేదా ఎంఎల్‌హెచ్‌పీలను సంప్రదించాలని కోరారు. ప్రజల్లో అవగాహన తీసుకురా వాలని ఆయన ఆశ కార్యకర్తలకు సూచించారు.

గ్రంథాలయంలో శిక్షణా శిబిరానికి మంచి స్పందన

విశాలాంధ్ర - పెందుర్తి: శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరానికి 34 మంది విద్యార్థులు, ఆరుగురు రిసోర్స్ పర్సన్స్ హాజరైనట్లు గ్రంథాలయ అధికారిణి బి.సూర్యకళ తెలియజేసారు. విద్యార్థులు సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న విషయాలపై పునఃశ్చరణ తరగతులు నిర్వహించా మని, సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న పాటలు, గేమ్స్ తదితర కార్యక్రమాలు గురించి విద్యార్థులకు మరొకసారి తెలియ జేసినట్లు తెలిపారు. గ్రంథాలయం యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేసి ప్రతిఒక్క విద్యార్థి గ్రంథాలయాన్ని విని యోగించుకోవాలని రిసోర్స్ పర్సన్, విశ్రాంత ఉపాధ్యాయులు జానకిరామ్ విద్యార్థులకు ఉద్బోధించారు. అలాగే విద్యార్థులు మంచి నడవడిక కలిగి ఉండాలని మంచి ప్రవర్తన గురించి రిసోర్స్ పర్సన్ లక్ష్మీ ప్రసన్న తెలియజేశారు. డాన్స్ టీచర్ పి.కళ్యాణి విద్యార్థులకు జానపద గీతాలు నృత్యం నేర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ప్రెసిడెంట్ పథకం శెట్టి భూలోక రావు, కార్యదర్శి ఆదాలి రామకృష్ణ పర్యవేక్షించారు. కాగా శుక్రవారం ఉదయం 9 గంటలకు సమ్మర్ క్యాంప్ విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం పెద్దల చేతుల మీదుగా నిర్వహి స్తున్నట్లు గ్రంథాలయ అధికారిణి సూర్య కళ తెలియజేశారు.

గాయత్రీ నగర్‌లో టిడిపి సంబరాలు

విశాలాంధ్ర- పియం పాలెం: జీవీఎంసీ జోన్ 2 పరిధి 6వ వార్డు పిఎం పాలెంలో ఆర్ హెచ్ కాలనీ, గాయత్రి నగర్ లో గురువారం తెదేపా శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సంబరాలకు ముఖ్య అతిథులుగా జనసేన నాయకులు ఈఎస్ఎస్ చంద్రరావు విశాఖ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు కేవీఆర్ క్యాటరింగ్స్ అధినేత గరే గురునాథ్ హాజరయ్యారు. బాణసంచా కాలుస్తూ

కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు బీసీ సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, కొరగంజి సూరిబాబు, రామకృష్ణ, బాబ్జీ, సంతోషి, రమణ, కరీం, వెంకటేష్, రమేష్, అనీల్, సునీల్, సలీం, పోతిన రమణ, పోతిన నాయుడు, స్థానిక నేతలు, కే.వి.ఆర్ క్యాటరింగ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లాకు జిప్సా అభినందనలు

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఇటీవల గాజువాక శాసనసభ స్థానానికి పోటీ చేసి రాష్ట్రంలోనే అత్యధిక ఓట్ల మెజారిటీతో గెలుపొందిన పల్లా శ్రీనివాసరావుకి జిప్సా సభ్యులు కలిసి శాలువాతో సన్మానించారు. ఆయన్ను అభినందించిన వారిలో జిప్సా అధ్యక్షుడు పి.భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, సభ్యులు డి.శ్రీనివాస్, మురళీ, రాము, సత్యనారాయణ, శ్యామ్, రవి, నాయుడు తదితరులు ఉన్నారు.

గంటాను కలిసిన బీఎస్పీ అభ్యర్థి భాగం

విశాలాంధ్ర - భీమిలి: చరిత్రలో నిలిచిపోయే మెజార్టీ సాధించిన ఘనత గంటా శ్రీనివాసరావుకే దక్కుతుందని బీఎస్పీ ఎమ్మెల్యేగా పోటీ చేసిన ఉమ్మడి తెలుగు రాష్ట్రాల మాల మహానాడు వ్యవస్థాపకులు భాగం గోపాల్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖలోని గంటా స్వగృహంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం భాగం మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన 27 పథకాలను మరల పునరుద్ధించేటట్లు కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు దృష్టికి తీసుకుని వెళ్లి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ వర్గాలకు న్యాయం చేయాలని కోరారు. అలాగే విశాఖ నుండి భీమిలి బీచ్ వరకు గత ప్రభుత్వం చేసిన భూ ఆక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు భాగం లక్ష్మి, రాష్ట్ర దళిత నాయకులు మామిడి వెంకట శివ, ఎడ్ల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ పోర్టు పనితీరు సూచీలో టాప్ 20లో విశాఖ పోర్టు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: ప్రపంచ బ్యాంక్ రూపొందించిన కంటైనర్ పోర్టు పనితీరు సూచీలో విశాఖపట్నం పోర్టు 18వ స్థానాన్ని సాధించి నూతన అధ్యాయాన్ని సృష్టించింది. విశాఖ కంటైనర్ టెర్మినల్ ఈ నూతన మైలు రాయిని చేరుకోవడంలో అత్యద్భుతమైన ప్రతిభను కనబరిచింది. కంటైనర్ పోర్టు పనితీరు సూచీలను లెక్కించడంలో పూర్తిగా నౌక బెర్తింగ్‌పై దృష్టి పెడుతుంది. పోర్టులు కంటైనర్ పోర్టులను ఎలా నిర్వహిస్తాయి అనే అంశం ద్వారా పనితీరును పరిగణలోకి తీసుకుంటాయి. ఈ సూచీల ద్వారా వ్యాపారస్తులు ఏ పోర్టును ఎంపిక చేసుకోవాలో నిర్ణయించుకునే అవకాశం కలుగుతుంది. షిప్ యజమానులు పోర్టు సామర్థ్యం, నౌక యొక్క టర్న్ అరౌండ్ సమయాలు ఎంతో ముఖ్యమైన ప్రమా ణాలుగా పరిగణిస్తారు. విశాఖ కంటైనర్ టెర్మినల్ పనితీరు సూచీల(కేపిఐ)లో క్రేన్‌లు గంటకు 27.5 కదలికలను నమోదు చేయడం, బెర్త్‌లో షిప్ యొక్క నిలువ సమయంలో 13 శాతం, పోర్టులో టర్న్ రౌండ్ టైమ్ 21.4 గంటలను నమోదు చేసి అత్యుత్తమ సూచీలను నెలకొల్పింది. వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించడంలో టెర్మినల్ ఆపరేటర్లతో కలిసి పోర్టు సంయుక్తంగా చేపట్టిన చర్యలే విసిటిపిఎల్ ఘనతలో కీలక పాత్ర పోషించిందన్నారు. కంటైనర్ టెర్మినల్ నేపాల్ ఆధారిత కంటైనర్లకు గేట్ వే పోర్టుగా ఉంది. 65కు పైగా కంటైనర్ లైన్లు కలిగి ఉంది. కంటైనర్ టెర్మినల్‌కు 8 నిరంతర సర్వీసులు ఉన్నాయి. పోర్టులోని పిపిపి ఆపరేటర్ల పూర్తి పనితీరును మారిటైం ఇండియా విజన్ (ఎంఐవి) 2030 నిబంధనలకు అనుగుణంగా చేపట్టడం జరుగుతుంది. విశాఖ కంటైనర్ టెర్మినల్ సాధించిన ఘనతను దృష్టిలో ఉంచుకుని పోర్టు రివార్డును ప్రకటించింది.

పోర్టు సాధించిన ఈ అసాధారణ విజయాన్ని స్టేక్ హెూల్డర్స్, రైల్వేలు, కస్టమ్స్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం అభినందించాయి. భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించడానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చాయి. ఈ ఘనతను సాధించిన టెర్మినల్ నిర్వాహకులు పోర్టు కుటుంబ సభ్యులను పోర్టు చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తు ట్విట్టర్ ద్వారా అభినందించారు. పోర్టు యొక్క సమర్థతను ఈ ఘనత చాటి చెప్పిందని అన్నారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో విశాఖ పోర్టు సరుకు రవాణాలో అత్యంత ప్రభావవంతమైన పనితీరును కనబరిచి మేజర్ పోర్టులలో 4వ స్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లోనే సరుకు రవాణాలో 13.5 శాతం వృద్ధిని కనబరిచింది. భారత సముద్ర యాన రంగంలో విశాఖపట్నం పోర్టు అద్భుతమైన పనితీరును కనబరచడమే కాకుండా విశాఖ పోర్టు యొక్క ప్రాధాన్యతను తెలియజేసింది. విశాఖపట్నం పోర్ట్ సాధించిన ఘనత పట్ల కేంద్ర పోర్టులు, నౌకా, జలరవాణా మంత్రిత్వ శాఖ సంతృప్తిని వ్యక్తం చేసింది. ఈ ఘనతను సాధించడంలో ముఖ్య పాత్ర పోషించిన పోర్టు చైర్ పర్సన్ డా ఎం.అంగముత్తును మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా ప్రశంసించింది. పోర్టు ఈ ఘనతను సాధించడంలో చైర్ పర్సన్ యొక్క నాయకత్వ లక్షణాలు మైలు రాయిని సాధించడంలో ఆయన చేసిన కృషిని అభినందించింది. ఈ వివరాలను విశాఖపట్నం పోర్టు అథారిటీ కార్యదర్శి టి.వేణు గోపాల్ మీడియాకు విడుదల చేశారు.

ప్రజా తీర్పుని గౌరవిస్తాం

- ప్రభుత్వానికి మా పూర్తి సహకారం ఉంటుంది
- ఇప్పిలి అనంతం వలిరెడ్డి శ్రీనివాసరావు

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఈ నెల 4న వేలువడిన ఎన్నికల ఫలితాల్లో నిరాశకి గురిచేసినప్పటికి ప్రజల తీర్పుని తాము గౌరవిస్తాం అని వైకాపా సీనియర్ నాయుకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసరావు, మీసాల వరాహాల నాయుడు అన్నారు. గురువారం చీపురుపల్లి వైకాపా కార్యాలయంలో ఆయన పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ముఖ్యమంత్రిగా ఈ రాష్ట్రానికి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, కులాలకు, మతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. గ్రామాల్లో సచివాల యాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా మంచి పరిపాలన అందించారని అన్నారు రాష్ట్రంలో 17 మెడికల్ కళాశాలాలు ఏర్పాటు చేసారనీ, అయినప్పటికీ ప్రజలు ఓడించారు ప్రజా తీర్పుని తప్పక గౌరవిస్తామని, స్థానిక ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు కి అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. వారికి ఎంపిపి, జెడ్పిటిసి సర్పంచులు ఎంపిటిసి వార్డు మెంబరులు అందరు మా పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. మాకు నమ్మి ఓట్లు వేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యకర్తలకు, నాయకులకు తాము ఎప్పుడు అండగా ఉంటామని, మీరు ఎప్పుడు పిలిచిన అందుబాటులో ఉంటామ ని, వారికి భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిటిసి లు రామదాస్, రేవల్ల సత్తిబాబు, కోరుకొండ దాలయ్య, పనస అప్పారావు, వార్డు మెంబర్ ఆదినారాయణ, మల్లెంపూడి శ్రీనివాసరావు, ప్రభాత్ కుమార్ మహంతి, మురళి, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

9న జీ తెలుగులో డ్రామా జూనియర్స్ సీజన్ 7

విశాలాంధ్ర - విశాఖపట్నం: అత్యంత ప్రేక్షకాదరణ పొందిన జీ తెలుగు డ్రామా జూనియర్స్ కొత్త సీజన్ ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. విజయవంతంగా 6 సీజన్లు పూర్తిచేసుకున్న జి తెలుగు డ్రామా జూనియర్స్ 7వ సీజన్ ఈ నెల 9న, సాం॥ 6:00 గంటలకు! ప్రతి ఆదివారం రాత్రి 9:00 గంటలకు సారమవుతుందన్నారు. భావోద్వేగం నిండిన కథతో ప్రేక్షకుల హృదయాలను తాకే కథతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ మేఘసందేశం ఈ నెల 10 నుంచి సోమవారం నుంచి శనివారం వరకు ప్రతిరోజు రాత్రి 7:30 గంటలకు!! ప్రసారం కానున్నదన్నారు. కొన్నేళ్లు ్లగా అందరి హృదయాలను గెలుచుకున్న పాపులర్ కిడ్స్ రియాలిటీ షో ఏడో సీజన్ కోసం తెలుగు బుల్లితెరపైకి రీఎంట్రీ ఇస్తోందన్నారు. డ్రామా జూనియర్స్ సీజన్ 7కు కూడా సీనియర్ నటి జయప్రద జడ్జిగా కొనసాగనున్నారన్నారు. టాలీవుడ్ కమెడియన్, దర్శకుడు బలగం వేణు, అందాల నటి పూర్ణ కూడా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పిల్లల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించనున్నారన్నారు. చిన్న పిల్లలను కళాకారులుగా ఎదగడానికి, ప్రేక్షకులను అలరించ దానికి జీ తెలుగు అద్భుత అవకాశాన్ని అందిస్తోందన్నారు.ఇక ఈ సీజన్ కి ప్రముఖ నటుడు, నిర్మాత శ్రీరామ్ వెంకట్ వ్యాఖ్యాతగా, పడమటి సంధ్యారాగం సీరియల్ అధ్య, రామలక్ష్మి మెంటర్లో వ్యవహరిస్తున్నారు.

జై భీమ్‌రావు భారత్ పార్టీని సంస్థాగతంగా పటిష్టపరుస్తాం

పార్టీ జిల్లా నాయకులు మరడాన వెంకట నాయుడు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జై భీమ్‌రావు భారత్ పార్టీని గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సంస్థాగతంగా పటిష్టపరుస్తామని ఆ పార్టీ జిల్లా నాయకులు మరడాన వెంకటనాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రెస్ క్లబ్బులో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జై భీమ్రావు భారత్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జడ శ్రావణ్‌కుమార్ ఆదేశాల మేరకు జిల్లాలో అన్ని గ్రామాల్లో, మండలాల్లో కార్యవర్గాలను ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లాలో ని అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసిన తమ పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేసి ప్రోత్సాహించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి చిన్నం అరుణ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని నియోజకవర్గాలలో జై భీమ్రావు పార్టీ తరఫున క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టపరిచే దిశగా ప్రణాళికలు రూపొంది స్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో జరిగిన సార్వత్రిక ఎన్నికలలో ఓటర్లు అద్భుతమైన తీర్పునిచ్చారని పేర్కొన్నారు. జిల్లాలో గెలిచిన అభ్యర్థులందరికీ తమ పార్టీ తరఫున శు భాకాంక్షలు తెలియజేశారు. సమావేశంలో రాజాం నియోజకవర్గ ఇన్చార్జ్ పొడుగు రామకృష్ణ తోపాటు పార్టీ ప్రతినిధులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు, చింతపల్లి దుర్గారావు, పెంట శంకర్ రావు, పైల జ్యోతి పాల్గొన్నారు.

స్మార్ట్ మానిటర్ 2024 శ్రేణిని ఆవిష్కరించిన శామ్‌సంగ్ ఇండియా

విశాలాంధ్ర -విశాఖ సిటీ: శామ్‌సంగ్, భారతదేశపు అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ బ్రాండ్, ఈరోజు తన 2024 శ్రేణి ఒడిస్సీ ఓ ఎల్ ఈ డి గేమింగ్ మానిటర్, స్మార్ట్ మానిటర్లు మరియు యు వ్యూ ఫినిటీని మానిటర్‌లను వినియోగదారుల కోసం తదుపరి-స్థాయి అనుభవాలు మరియు కొత్త ఏఐ సామర్థ్యాలను1 అన్‌లాక్ చేసే ఫీచర్లతో ఆవిష్కరించింది. ఒడిస్సీ ఓ ఎల్ ఈ డి జి 6, మరియు స్మార్ట్ మానిటర్ శ్రేణి మెరుగైన వినోద ఫీచర్లతో మరింత సంతోషాన్నిఅందిస్తాయి, అయితే ఏఐ మరియు వ్యూ ఫినిటీ శ్రేణి ద్వారా ఆధారితమైన స్మార్ట్ మానిటర్ ఏం 8 పూర్తి వర్క్‌స్టేషన్‌ను సృష్టించగల కనెక్టివిటీని పెంచుతుంది. "మా 2024 శ్రేణి ఒడిస్సీ ఓ ఎల్ ఈ డి గేమింగ్ మానిటర్, వ్యూఫినిటీ మరియు స్మార్ట్ మానిటర్‌లను పరిచయం చేయడం ద్వారా, మేము వినియోగదారుల కోసం మెరుగైన అనుభవాలను అందించాలనుకుంటున్నాము అని ఆ సంస్థ ప్రాంతీయ ప్రతినిధి పునీత్ సేథ్ అన్నారు.

మాగ్నిఫ్లెక్స్ ఇండియా నుంచి మాగ్నిజియో ఆవిష్కరణ

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా, విలాసవంతమైన పరుపుల బ్రాండ్ అయిన మాగ్నిఫ్లెక్స్ పర్యావరణ సుస్థిరతకు ప్రాధాన్యతనిస్తూ అత్యుత్తమ సౌకర్యాన్ని అందించే మాగ్ని జియోను మార్కెట్లోకి విడుదల చేసింది.

ఈ సందర్భంగా మాగ్నిఫ్లెక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్ నిచాని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పర్యావరణ క్షీణతతో భూగోళం నేడు క్లిష్ట సవాళ్లను ఎదుర్కొంటూ కీలక దశలో ఉందని, మాగ్నిజియో ఆవిష్కారంతో, మాగ్నిఫ్లెక్స్ ఇండియా మరింత సుస్థిర భవిష్యత్తు వైపు ప్రయాణంలో కీలక ఘట్టాన్ని సూచిస్తుందన్నారు. మాగ్నిజియో ప్రతీ కొనుగోలుపై కొనుగోలు దారు తరఫున మాగ్నిఫ్లెక్స్ ఒక మొక్కను నాటనుందని, అంతేగాకుండా కొనుగోలుదారు పేరు లేదా వారి నామినీ పేరు మీద సర్టిఫికేట్ జారీ చేస్తుందన్నారు.

చంద్రబాబు, నారా లోకేష్‌ను కలిసిన బండారు

విశాలాంధ్ర- వి.మాడుగుల: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను గురువారం విజయవాడలో మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన బండారు సత్యనారాయణమూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారివురికి పుష్పగుచ్చాలు అందజేశారు. అనంతరం నియోజకవర్గంలో కౌంటింగ్ సరళిని గురించి అడిగి తెలుసుకున్నారు.

ఉత్తరాంధ్ర అసైన్డ్ భూములపై సీనియర్ సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: విశాఖ జిల్లా ఆనందపురం, భీమిలి, విజయనగరం జిల్లా భోగాపురం, ఉత్తరాంధ్ర జిల్లాల్లో అన్యాక్రాంతమైన వేలాది ఎకరాల అసైన్డ్ భూములపై హైకోర్టు సీనియర్ సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.లోకనాధం డిమాండ్ చేసారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడుతో కలిసి సిఐటియు విశాఖ జిల్లా కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్‌లో లోకనాధం మాట్లాడారు. ఈ భూములు అన్యాక్రాంతంపై గత టిడిపి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందని, దీనికి 3200 ఫిర్యాదులు అందాయని, తరువాత అధికారం చేపట్టిన వైఎస్ఆర్‌సిపి ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసిందని దీనికి 4300 ఫిర్యాదులు అందాయన్నారు. ప్రభుత్వాలు మారాయని, సిట్‌లు ఏర్పాటు చేసారని, సమగ్ర రిపోర్టులు ప్రకటించలేదన్నారు. దళితులకు దక్కాల్సిన వేలాది ఎకరాల భూములు మాత్రం సంపన్నులకు అన్యాక్రాంత మయ్యాయన్నారు. వీటిలో గత ప్రభుత్వంలోని ఉన్నతా ధికారులు రాజకీయ అగ్రనేతల పాత్ర వుందని ఆరోపణలు వచ్చాయన్నారు. బడుగు, బలహీన వర్గాలు అన్యాయానికి గురవుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వం తెచ్చిన జీవో నెంబరు 596 అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకున్న అక్రమార్కులను రక్షించేదిగానే వుందని, నేడు రాష్ట్రంలో అధికారం చేపడుతున్న టిడిపి ప్రభుత్వం ఈ భూములపై సీనియర్ సిట్టింగ్ జడ్జి చేత సమగ్ర విచారణ జరిపించాలని, జీవో నెంబరు 596 రద్దు చేయాలని డిమాండ్ చేసారు. రాష్ట్రంతోపాటు విశాఖ ప్రజానీకం టిడిపికి అధికారం ఇచ్చారని, గాజువాక ఎమ్మెల్యే, విశాఖ ఎంపి అభ్యర్థులకు అత్యధిక మెజారిటీలు అందించారని, ప్రజల అభీష్టానికి అణుగుణంగా స్టీల్‌ప్లాంటు అమ్మకం ఆపించాలని, స్వంత గనులు, వర్కింగ్ కేపిటల్, నిర్వాశితులకు ఉద్యోగాలు, ఖాళీగా ఉన్న 5 వేల పోస్టులు భర్తీ సాధించాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం భూములు కేటాయించనందువల్లే రైల్వేజోన్ నిర్మాణం సాధ్యపడలేదని కేంద్ర బిజెపి ప్రభుత్వం నాటకం ఆడిందని, నేడు టిడిపి ఎన్‌డిఎ భాగస్వాములుగా వున్నందున బిజెపి నాటకానికి తెరదించి రైల్వేజోన్ నిర్మాణం, రాష్ట్రానికి ప్రత్యేకహెూదా, ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలు అమలు సాధించాలని కె.లోకనాధం కోరారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ ఈ సార్వత్రిక ఎన్నికల్లో సిపిఎం గాజువాక సిపిఐ విశాఖ వెస్ట్ ఇతర అసెంబ్లీ నియోజకవర్గాలు, విశాఖ పార్లమెంటుకు కాంగ్రెస్ అభ్యర్థులు పోటీ చేశారని, ఇండియా కూటమి అభ్యర్థులు విజయానికి కృషి చేసిన కార్యకర్తలకు, సహకరించిన శ్రేయోభిలాషులకు, అభిమానులకు ధన్య వాదాలు తెలియజేసారు. ఈ ఎన్నికల్లో వైసిపి, టిడిపి పార్టీలు కోట్లాది రూపాయాలు డబ్బును విచ్చలవిడిగా పంచాయని, కులంతో పాటు అన్ని రకాల తాయిలాలు ప్రయోగించా రన్నారు. ప్రజల ఆలోచనలను సమస్యల నుండి దూరం చేసారని, ఇన్ని అవరోధాలు మధ్య కూడా వేలాది మంది ప్రజలు సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేసి తమ నిజాయితీని, నిబద్ధతను చాటారన్నారు. వీరందరికీ హృదయ పూర్వకంగా ధన్యవాదాలు తెలియచేసారు. ప్రజల,కార్మికుల పక్షాన విశాఖ అభివృద్ధికి సిపిఎం తన కృషిని కొనసాగిస్తుందని తెలియచేసారు. విశాఖ జిల్లాలో విజయం సాధించిన తెలుగుదేశం విశాఖ పార్లమెంట్ సభ్యునికి, తెలుగుదేశం, జనసేన శాసన సభ్యులకు సిపిఎం విశాఖ జిల్లా కమిటీ తరుపున శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్‌కి శుభాకాంక్షలు వెల్లువ

విశాలాంధ్ర - యలమంచిలి: ఉద్యోగ ఉపాధ్యాయులు ప్రజల ఆకాంక్ష మేరకు నూతనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వానికి ఏపీసిపిఎస్ఈఏ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి మోటూరు త్రినాధ స్వామి తన ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఈ రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయులపై ఉక్కు పాదం మోపి అనేక ఇబ్బందులకు గురి చేయడం జరిగిందని అన్నారు. అదే మాదిరిగా వారికి న్యాయబద్ధంగా రావలసిన డిఎ పిఆర్సి మొదలైన ఆర్థిక లావాదేవీలు 20000 కోట్లకు పైగా బకాయిలు పెట్టి నేటికీ ఇవ్వకుండా గద్దె దిగారన్నారు. సిపిఎస్ ఉద్యోగులకు వారం రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తానని మాట ఇచ్చి మోసం చేసినందుకు నేడు తగిన మూల్యం చెల్లించుకున్నారన్నారు. అదేవిధంగా యలమంచిలి నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే కన్నబాబు రాజు ఉద్యోగ ఉపాధ్యాయుల పట్ల మర్యాద లేకుండా బూతు పదజాలంతో తిడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులను భయభ్రాంతులకు గురిచేస్తూ తనకు నచ్చని వారిని సస్పెండ్లు చేస్తూ ఏజెన్సీ ప్రాంతాలకు ట్రాన్సుర్లు చేస్తూ అనేక ఇబ్బందులకు గురి చేశారన్నారు. గత 14 సంవత్సరాలుగా అనేక ప్రజా ఉద్యమాలు చేస్తూ నేడు నియోజకవర్గ చరిత్రలో ఎన్నడు లేని విధంగా అత్యధిక మెజార్టీతో కూటమి అభ్యర్థి జనసేన పార్టీ నుండి సుందరపు విజయ్ కుమార్‌ని ఎమ్మెల్యేగా గెలవడం జరిగిందన్నారు. ఆయన సారధ్యంలో యలమంచిలి నియోజకవర్గ అభివృద్ధికి ఉద్యోగ ఉపాధ్యాయులంతా సమిష్టిగా పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

సెల్ఫీ ప్రమాదం: వ్యక్తికి గాయాలు

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం - చీడికాడ రోడ్డులో గల ఐటీఐ సమీపంలో ఓ వ్యక్తి చీడికాడ వైపు వెళుతుండగా తుప్పల్లో పడిపోయాడు. తలకు తీవ్ర గాయాలతో పడి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. దీంతో అటుగా వెళుతున్న వాహనదారులు చూసి క్షతగాత్రుడ్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. మద్యం మత్తులో బైక్ డ్రైవింగ్ చేస్తూ ఆ సమయంలో సెల్ఫీ తీదుకుంటుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. దీనిపై గాయపడిన వ్యక్తిని కొందరు గుర్తించారు. చీడికాడ మండలం ఇంటి పాల%శీ% గ్రామానికి చెందిన వి.తులసి రావు (38) గా తెలిపారు. చోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేసి, ఎన్టీఆర్ హాస్పిటల్ తరలించారు.

బీఎండబ్ల్యూ ఐ5 ఎం60 ఎక్స్ డ్రైవ్ విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఈ ఆల్-ఎలక్ట్రిక్ స్పోర్టీ ఎగ్జిక్యూటివ్ సెడాన్ సొగసైన ఉనికి, ఆవిష్కారాత్మక టెక్నాలజీ మరియు డైనమిక్ పనితీరును కలిగి ఉంటుంది. ఇది బీఎండబ్ల్యూ జి ఎం బి హెచ్ నుంచి పెర్ఫార్మెన్స్ మోడల్‌గా, ఆల్-ఎలక్ట్రిక్ బీఎండబ్ల్యూ ఐ 5 ఎం 60 ఎక్స్ నిర్దిష్ట బాహ్య లక్షణాలతో ప్రామాణికంగా వస్తుంది, ఇది దాని అత్యుత్తమ క్రీడా సామర్థ్యాన్ని దృశ్యమానంగా నొక్కి చెబుతుంది. ఫస్ట్-ఎవర్ బీఎండబ్ల్యూ 5 ఎం 60 ఎక్స్ డ్రైవ్ ఈరోజు నుండి భారతదేశంలోని అన్ని బీఎండబ్ల్యూ డీలర్‌షిప్‌లలో పూర్తిగా బిల్ట్-అప్ యూనిట్ (సి బి యు) మోడల్‌గా అందుబాటులో ఉందని బీఎండబ్ల్యూ అధ్యక్షులు విక్రమ్ పవాహ్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - యలమంచిలి: 33/11 కెవి యలమంచిలి సబ్ స్టేషన్ పరిధిలో గల యలమంచిలి టౌన్ ఫీడర్ లైన్‌కు సంబంధించి మెయింటనెన్స్ (చెట్లు తొలగింపు) నిమిత్తం శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొత్త పేట, మిలటరీ కాలనీ, యానాదొ కాలనీ, స్టేషన్ రోడ్, మధురా నగర్, నాగేంద్ర కాలనీ, కోర్ట్ పేట, భవనం వీధి, గాంధీనగర్, ద్వారకానగర్, నెహ్రూనగర్, శేషుగెడ్డ శివాలయం వీధిలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని విద్యుత్ ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. అవకాశం ఉన్న చోట ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. కావున వినియోగదారులు సహకరించ వలసిందిగా కోరారు.